

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 42 | బుధవారం 20, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari


# స్వయంగా చేపలు కొని, గరిటె తిప్పి..

## మత్స్యకార కుటుంబంతో చంద్రబాబు భోజనం..

- కావలి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన
- చేపల మార్కెట్ ను సందర్శించి స్వయంగా చేపలు కొనుగోలు చేసిన సీఎం
- ఓ మత్స్యకారుడు ఇంటి చేపల కూరతో భోజనం
- అందరితో పాటే కింద కూర్చుని భోజనం చేసిన చంద్రబాబు
- ఆనందంతో పొంగిపోయిన మత్స్యకారుడి కుటుంబం



నెల్లూరు మే 19 : ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు ఓ మత్స్యకార కుటుంబం ఇంట్లో సొంత కుటుంబ సభ్యుడిలా గడిపారు. స్వయంగా మార్కెట్‌లో చేపలు కొని, వారింటికి తీసుకెళ్లి, వంట చేస్తుండగా సరదాగా గరిటె తిప్పారు. ఆపై ఆ కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఆసక్తికర ఘటన నెల్లూరు జిల్లా కావలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు తుమ్మలపెంట గ్రామానికి వెళ్లారు. అక్కడ 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం స్థానిక చేపల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మహిళా వ్యాపారుల నుంచి చేపలు కొనుగోలు చేశారు. అనంతరం, మార్కెట్‌లో పరిచయమైన మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు సీఎం ఆయన ఇంటికి వెళ్లారు. తాను తెచ్చిన చేపలను వండమని తానంగారి బాబు భార్య వెంకమ్మకు ఇచ్చారు. ఆమె చేపల పులుసు వండుతుండగా, చంద్రబాబు అక్కడే ఉండి ఆసక్తిగా గమనించారు. కొద్దిసేపు ఆయన కూడా గరిటె తిప్పారు. వంట పూర్తయ్యాక, సీఎం చంద్రబాబు వారి కుటుంబ సభ్యులతో కలిసి కిందనే కూర్చుని భోజనం చేశారు. తన చేతులతో వారికి చేపల పులుసు వడ్డించడం విశేషం. తమ ఇంటికి వచ్చి, తమతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రికి తానంగారి బాబు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# ఢిల్లీలో కీలక సమావేశాలతో

## బిజీగా ఉన్న నాదెండ్ల మనోహర్

ఢిల్లీ మే 19 : ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఢిల్లీ పర్యటన రెండో రోజు అత్యంత చురుగ్గా సాగింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్, సంయుక్త కార్యదర్శి సుజాత శర్మలతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలతో పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సరఫరా వ్యవస్థ సమన్వయంపై లోతుగా చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో మర్యాదపూర్వకంగా భేటీ అయి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు, సరుకులు అందించేందుకు కేంద్ర సహకారాన్ని కోరారు. తమ ప్రభుత్వానికి ప్రజల ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని, పౌరసరఫరాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు వేగవంతం చేస్తున్నామని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.



ఈ చర్చలపై కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించినట్లు తెలుస్తోంది.

## దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి

# జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

అమరావతి మే 19 : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏపీ దేవాదాయ శాఖ సస్పెండెడ్ అసిస్టెంట్ కమిషనర్ కే. శాంతికి ఏసీబీ ప్రత్యేక కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌ను కోర్టు జూన్ 2 వరకు పొడిగించింది. జైలు నుంచి బయటకు వచ్చేందుకు శాంతి రెండు సార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ.. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఆమెకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ న్యాయవాదుల వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం ఆమె బెయిల్‌ను తిరస్కరించింది. గతంలో జరిగిన ఏసీబీ దాడుల్లో, నిబంధనలకు విరుద్ధంగా సంపాదించిన కోట్లాది రూపాయల విలువైన బినామీ ఆస్తులు, భూముల పత్రాలు, నగదును స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా రిమాండ్ పొడిగింపుతో ఆమె జైలులోనే మరికొన్ని రోజులు గడపక తప్పడం లేదు. ప్రస్తుతం ఆమె విజయవాడ జిల్లా జైల్లో ఉన్నారు.



## రాబోయే రోజుల్లో కావలి 'కనకపట్నం'గా పాత పేరు సార్ధకం అవుతుంది: సీఎం చంద్రబాబు

- కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో చంద్రబాబు సభ
- మత్స్యకార సేవలో భాగంగా 1.30 లక్షల కుటుంబాల ఖాతాల్లోకి రూ.262 కోట్లు జమ
- వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

నెల్లూరు మే 19 : రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తన ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంటలో మంగళవారం జరిగిన 'మత్స్యకార సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని సుదీర్ఘ ప్రసంగం చేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచేందుకు 1,30,796 కుటుంబాలకు రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 262 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వమిచ్చిన రూ.10 వేల భృతిని రూ.20 వేలకు పెంచామని గుర్తుచేశారు. ఒకప్పుడు వాణిజ్య వైభవంతో తులతూగి 'కనకపట్నం'గా పేరుగాంచిన కావలి, మళ్ళీ తన పూర్వపు కీర్తిని సంతరించుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకెళ్లి, ఆ పేరును సార్ధకం చేసుకోబోతోందని అన్నారు. ఇది కేవలం ఆశాభావం కాదని, తాము ఇస్తున్న స్పష్టమైన హామీ అని తెలిపారు.



**కనకపట్నం' కావలికి వరాల జల్లు**

స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి విజ్ఞప్తి మేరకు, కావలి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. ఈ ప్రకటనలతో కావలి భవిష్యత్ చిత్రం కళ్ళకు కట్టినట్టయింది. 25 మత్స్యకార గ్రామాలను అనుసంధానించేందుకు రూ. 6.27 కోట్లతో మెటల్ రోడ్ల నిర్మాణం. రైతులు, మత్స్యకారులకు జీవనాధారమైన బకింగ్‌హామ్ కాలువ పూడికతీత పనులకు రూ. 6.9 కోట్లు. ప్రాంతంలో దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత కీలకమైన 220/133/33 కేవీ సబ్‌స్టేషన్‌కు తక్షణ ఆమోదం. ఈ పనుల విలువ రూ. 13 కోట్లకు పైగా ఉండటంతో, రాబోయే రోజుల్లో కావలి రూపురేఖలు మారనున్నాయని స్పష్టమైంది. దీనికి తోడు రామాయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం, సమీప ఇండస్ట్రియల్ కారిడార్లతో ఈ ప్రాంతం అభివృద్ధికి మకుటాయమానంగా నిలుస్తుందని, కావలి నిజమైన 'కనకపట్నం'గా విలసిల్లుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**అలలపై బతుకులకు... రూ. 20 వేల అండ**

ప్రాణాలను పణంగా పెట్టి, సముద్రపు అలలతో నిత్యం పోరాడే మత్స్యకార సోదరుల కష్టాలు తనకు తెలుసంటూ ప్రసంగం ప్రారంభించిన ముఖ్యమంత్రి, వారి కుటుంబాలకు అండగా నిలవడమే తన ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఉద్ఘాటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం, వేట నిషేధ భృతిని రూ. 10,000 నుంచి ఏకంగా రూ. 20,000కు పెంచుతున్నట్లు ప్రకటించి, సభా ప్రాంగణంలో హర్షాతిరేకాలు నింపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ఇందుకోసం రూ. 262 కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. "మీరు ధైర్యంగా వేటకు వెళ్ళండి. మీ కుటుంబాలను ఆదుకునే బాధ్యత నాది. మీ కష్టాన్ని గుర్తించి, గౌరవించే ప్రభుత్వం ఇది" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**'తీరం మనదే.. వేట మనదే'.. పొరుగువారికి సింహగర్జన**

మత్స్యకారుల హక్కుల పరిరక్షణ విషయంలో తన ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ముఖ్యమంత్రి తన మాటల్లో స్పష్టం చేశారు. "తీరం మనదే, బోటు మనదే, వేట మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు అక్రమంగా ప్రవేశిస్తే ఉపేక్షించేది లేదు. వారిని వెంటాడతాం, వేటాడతాం. మన మత్స్యకారుల సంపదను దోచుకోవడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తీరప్రాంతంలో నిఘాను పటిష్ఠం చేస్తామని, పెట్రోలింగ్ బోట్ల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, మత్స్యకారుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, 60 శాతం సబ్సిడీతో 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో మత్స్యకారులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

**సముద్రపు నాచుతో మహిళల జీవితాల్లో మార్పు**

కేవలం తక్షణ సాయంతోనే సరిపెట్టకుండా, మత్స్యకారులను ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "సముద్ర గర్భంలో అపార సంపద దాగి ఉంది. దానిని మీ అభివృద్ధికి సోపానంగా మారుస్తాను. మగవారు వేటకు వెళ్తే, మన ఆడబిడ్డలు తీరంలోనే ఉంటూ అదనపు ఆదాయం సంపాదించే మార్గం చూపిస్తాను" అంటూ సముద్రపు నాచు (సీవీడ్) సాగు ప్రాజెక్టును ఆవిష్కరించారు. "ఈ సీవీడ్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉంది. మన డ్వాక్రా మహిళలకు ఆధునిక సాంకేతికత అందించి, దీని సాగులో శిక్షణ ఇప్పించి, వారిని పారిశ్రామికవేత్తలుగా మారుస్తాను. మీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ కల్పించే బాధ్యత నాది. నేను మీకు ముఖ్యమంత్రినే కాదు, ఒక 'మార్కెట్ మేనేజర్'గా కూడా పనిచేస్తాను" అని హామీ ఇచ్చారు.

**వేదికపైనే అధికారులకు క్లాస్.. పాలనలో పరుగు**

తన పాలనలో పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తానని చెప్పడమే కాదు, చంద్రబాబు దానిని వేదికపైనే ఆచరించి చూపారు. నెల్లూరు జిల్లాలో వివిధ శాఖల పనితీరుపై ప్రజల సంతృప్తి శాతాన్ని విశ్లేషిస్తూ, అధికారులకు అక్కడికక్కడే దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక సంతృప్తి శాతం సాధించిన జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను పేరుపేరునా అభినందించారు. అదే సమయంలో, ఆర్టీసీ, దేవదాయ, గ్రామీణ నీటి సరఫరా వంటి శాఖల్లో పనితీరు మెరుగుపరుచుకోవాలని సున్నితంగా సూచించారు. "ప్రజాసేవలో అలసత్వం వద్దు. ప్రజల సంతృప్తే మనకు కొలమానం కావాలి" అని హితవు పలికారు.

## వైద్యుని హత్య కేసులో నిందితుడికి

# జీవిత ఖైదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ మే 19 : దేశవ్యాప్తంగా సంచలనాత్మకమైన డా. ఎస్.డి. సుబ్బయ్య హత్య కేసు నిందితుడికి సుప్రీంకోర్టు మంగళవారం జీవిత ఖైదు విధించింది. తొమ్మిది మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. పి. పొన్నుస్వామి, అతని భార్య మేరీ పుష్పం, వారి కుమారులు పి. బాసిల్, పి. బోరిస్ సహా తొమ్మిది మంది నిందితులకు వ్యతిరేకంగా ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ధర్మాసనం సమర్థించింది. ఈ కేసులో తండ్రి మరియు ఇద్దరు కుమారులతో సహా ఏడుగురు నిందితులకు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించింది. శ్రీమతి పుష్పం, మరో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తొమ్మిది మంది నిందితులను హైకోర్టు నిర్దోషులుగా విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

















# తీరం మనదే-మత్స్య సంపదా మనదే

**- మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడతాం - చేపల వేటకు సబ్సీడీపై 200 మెకనైజ్డ్ బోట్లు - సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు - నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే - మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం - ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం - గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం - నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

నెల్లూరు/కావలి,(ప్రజా సీమ) మే 19: తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్య కారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్య కారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మ వద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా...**

"రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్దతుల ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్య కార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్య కార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రొటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్ గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం**

"దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ.9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026-27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సీడిని మత్స్య కార బోట్లకు అందించాం. రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సీడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ.20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 2014-19 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు**

"గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఎక్కడా అభివృద్ధి చేయలేదు. సంక్షేమం అందించలేదు. అన్ని రంగాలను విధ్వంసం చేశారు.. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. అలాగే మత్స్య రంగం కూడా దెబ్బతినేలా చేశారు. రాష్ట్రానికున్న సుదీర్ఘమైన తీరప్రాంతంలో లక్షల మంది మత్స్య కారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. వారికి నాటి ఐదేళ్ల పాలనలో కష్టాలే ఉన్నాయి. 2019-24 మధ్యలో చేపల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత మత్స్య సంపద పైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. ఇలాంటి రంగాన్ని కూడా వాళ్లు విధ్వంసం బాట పట్టించారు. గొడ్డలి పార్టీ లేనిపోని కుట్రలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమం చేస్తుంటే గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి పెద్ద దస్తగిరి వరకూ హత్యలు చేస్తూ... కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని వెనక్కు లాగుతోంది. వైసీపీ చేసిన విధ్వంసాన్ని సరి చేయడానికి 23 నెలల సమయం పట్టింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటంతో పాటు విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. బుల్లెట్ స్పీడ్ లో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 24 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వస్తాయి. రాయలసీమలో డిఫెన్సు, డ్రోన్స్, స్పేస్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశ్రమలు వస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ తిరుపతి వద్ద బుల్లెట్ మోటారు సైకిల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. నెల్లూరు జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. మరిన్ని వస్తాయి. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో 25 మత్స్య కారుల గ్రామాలను కనెక్టు చేస్తూ మెటల్ రోడ్లు వేస్తాం. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్ కు రూ.6.19 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ కాలువను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ గానూ తీర్చిదిద్దుతాం. ప్రతీ ఇంటిపైనా, పొలంలోనూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు**

"టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారు. బీసీలకు- టీడీపీకి దశాబ్దాల అనుబంధం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల వేతనం, వడ్డెర్లకు, గీత కార్మికులకు గనులు, మద్యం దుకాణాలను కేటాయిస్తున్నాం. 45 ఏళ్లుగా బీసీలు టీడీపీని ఆదరించారు. వారి రుణం తీర్చుకుంటాం. బీసీల కోసం... బీసీ మహిళల కోసం కొత్త విధానాలను అమల్లోకి తెచ్చి.. వారిని ఆర్థికంగా చేయూత ఇస్తున్నాం. సీవీడ్ లాంటి కొత్త ప్రత్యామ్నాయాలను ఎంచుకోవటం ద్వారా అదనపు ఆదాయం సంపాదించేలా చర్యలు చేపడతాం. మత్స్య కారుల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య కార యువతకు నైపుణ్యాలు నేర్పి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా ప్రజల సేవకులే. జవాబుదారీతనంతో పనిచేయాలనే లక్ష్యాన్ని పెట్టాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడింది. ఆయిల్ ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఉంది. మనం అంతా నా దేశం- నా బాధ్యత అనుకుని పనిచేయాలి. ప్రధాని మోదీ 7 సూత్రాలను సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలి. అనవసరపు ప్రయాణాలు తగ్గించుకుందాం. ప్రజా రవాణాను మాత్రమే వినియోగిద్దాం. బంగారం కొనుగోలును వాయిదా వేద్దాం. టూరిజం కోసం విదేశీ ప్రయాణాలు తగ్గించుకుందాం. మన దేశంలోనే పర్యాటక ప్రాంతాలు, బీచ్ లకు వెళ్లాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ**

మత్స్య కారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్య కారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక వ్యవస్థను అధికారులు సీఎం ఎదుట ప్రదర్శించారు. ఏపీ సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్లను వినియోగిస్తున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. స్థానిక మత్స్య కార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఇక స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతును అభినందించారు. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనంరామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# ఇంటింటి వైద్యానికి అక్షయపాత్ర "వస్తు గుణ దీపిక"

**- మూలికల మర్మం.. వంటింటి పదార్థాలే మందులని చెప్పిన మహా గ్రంథం**
**- వైద్య విద్యార్థి నుంచి గ్రామీణ వైద్యుడివరకు అందరికీ మార్గదర్శి**
**- ఆధునిక యుగంలో మళ్లీ వెలుగులోకి వస్తున్న తెలుగు ఆయుర్వేద విజ్ఞానం**

ఏపీ బ్యూరో (ప్రజాసీమ): ఒకప్పుడు ప్రతి గ్రామంలోనూ ఒక పెద్దమనిషి ఉండేవాడు. ఇంట్లో పిల్లవాడికి జ్వరం వచ్చినా, పొట్ట నొప్పి వచ్చినా, పాము కాటేసినా, మొదట ఆయన చెప్పిన మూలికల వైద్యాన్నే ఆశ్రయించేవారు. వేప, తులసి, మిరియాలు, శొంఠి, పసుపు... ఇలా మన వంటింట్లో కనిపించే పదార్థాలకే ఔషధ గుణాలున్నాయని భారతీయ వైద్య సంప్రదాయం శతాబ్దాల కిందటే నిరూపించింది. ఆ సంప్రదాయ జ్ఞానాన్ని ఒక మహాగ్రంథంలా సమీకరించిన తెలుగు గ్రంథమే "వస్తు గుణ దీపిక". తెలుగు ఆయుర్వేద సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ గ్రంథం, సాధారణ ప్రజల నుంచి వైద్య విద్యార్థుల వరకు అందరికీ ఉపయోగపడే విజ్ఞాన భాండాగారంగా భావిస్తారు. ఇందులో వందలాది మూలికలు, చెట్లు, ఆహార పదార్థాలు, లోహాలు, పాలు, నూనెలు, పండ్లు, విత్తనాల ఔషధ గుణాలు వివరించబడ్డాయి. ఏ పదార్థం శరీరంలో వేడిని పెంచుతుంది? ఏది చల్లదనాన్ని ఇస్తుంది? ఏది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది? ఏది విషాన్ని తగ్గిస్తుంది? వంటి అంశాలను ఆయుర్వేద దృష్టితో విశ్లేషించడం ఈ గ్రంథం ప్రత్యేకత.

ఈ పుస్తకంలో కేవలం మూలికల పేర్లు మాత్రమే కాకుండా వాటి స్వభావం, రుచి, శరీరంపై ప్రభావం, వాడే విధానం, కొన్ని సందర్భాల్లో దుష్ప్రభావాలు కూడా పేర్కొనడం గమనార్హం. అందుకే పాత తరాల వైద్యులు దీనిని ఒక "గ్రామీణ మెడికల్ ఎన్సైక్లోపీడియా"గా పరిగణించేవారు. ముఖ్యంగా వైద్య సదుపాయాలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లో ఈ గ్రంథం ఆధారంగా ప్రజలు ఎన్నో ఇంటి వైద్య పద్ధతులు పాటించేవారని పెద్దలు చెబుతుంటారు.

ఆధునిక యుగంలో ఫాస్ట్ ఫుడ్, రసాయనిక ఆహారం, జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మళ్లీ ఆయుర్వేదంపై ఆసక్తి పెరుగుతోంది. ఇమ్యూనిటీ, సహజ చికిత్స, మూలికల వైద్యం వంటి అంశాలపై ప్రజలు దృష్టి సారిస్తున్న వేళ "వస్తు గుణ దీపిక" వంటి పుస్తకాలు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా, పీడీఎఫ్ లైబ్రరీలు, డిజిటల్ ఆర్కైవ్‌ల ద్వారా యువత కూడా ఈ గ్రంథాన్ని వెతుకుతోంది.




అయితే నిపుణులు ఒక ముఖ్యమైన హెచ్చరిక కూడా చేస్తున్నారు. ఈ గ్రంథాల్లో ఉన్న సమాచారాన్ని అవగాహన కోసం చదవాలి గానీ, తీవ్రమైన వ్యాధులకు స్వయంగా మందులు తయారు చేసుకుని వాడటం ప్రమాదకరమని సూచిస్తున్నారు. ప్రతి మూలిక ప్రతి ఒక్కరికి ఒకేలా పనిచేయదని, శరీర స్వభావం, వయస్సు, వ్యాధి పరిస్థితులను బట్టి వైద్యుల సలహా అవసరమని చెబుతున్నారు. అయినా ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. పాశ్చాత్య వైద్య వ్యవస్థ ఎంత అభివృద్ధి చెందినా... ప్రకృతిలోనే ఔషధం ఉందని మన పూర్వీకులు చెప్పిన జ్ఞానం ఇప్పటికీ చావలేదు. "వస్తు గుణ దీపిక" వంటి గ్రంథాలు కేవలం పుస్తకాలు కాదు... తెలుగు భాషలో నిలిచిపోయిన వైద్య నాగరికతకు జీవంతమైన సాక్ష్యాలు.

# భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానం

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



తాడిపత్రి (ప్రజాసీమ): శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, ఎగువపల్లి గ్రామంలో శ్రీ బమ్మెర పోతన భాగవత భక్త సమాజం దంతలపల్లి శాఖ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు జరిగిన భాగవత సప్తాహం కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానమన్నారు. పురాణ ఇతిహాసాలు సమాజానికి నిత్య దిక్సూచికలని, రామాయణం ఆదర్శ శాస్త్రమని, మహాభారతం ధర్మ-నీతి శాస్త్రమని, శ్రీమద్ భాగవతం మోక్ష శాస్త్రమని వివరించారు. భగవంతుని దశావతారాలు, ప్రహ్లాదుడు, ధృవుడు, అంబరీషుడు వంటి భక్తుల గాధల ద్వారా భాగవతం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని చెప్పారు. ఆధునిక మానవుడు అన్నీ ఉన్నా అశాంతితో అలమటిస్తున్నాడని, ఆధ్యాత్మిక క్షేత్రాలు, భాగవత సమావేశాలు మనసుకు ప్రశాంతిని కలిగిస్తాయని డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి భాగవతులు ఏ. వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షత వహించారు. భాగవతులు నరేంద్ర నాయుడు, రాఘవరెడ్డి, యాంకర్ శ్రీనివాస్ రెడ్డి, అన్నదాత శ్రీనివాస్ రెడ్డి, యాగంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొని వేదికను వెలిగించారు.

# భారత చైతన్య యువజన పార్టీ జిల్లా కో కన్వీనర్ గా నూకరాజు

**- యువతలో నూతన ఉత్సాహం పార్టీ సిద్ధాంతాలు ముందుకు తీసుకు వెళ్తా - నూకరాజు సందీప్ యాదవ్**



చిట్వేలి(ప్రజా సీమ) : భారత చైతన్య యువజన పార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్, ఆయన నాకు బాధ్యత అందించిన ఆయన నమ్మకాన్ని వమ్ము చేయనని నాపై నమ్మకం ఉంచి జిల్లా యూత్ కోకన్వీనర్ గా నియమించినందుకు కృతజ్ఞుడనై పార్టీకి పనిచేస్తానని నూతనంగా ఎన్నికైన నూకరాజు సందీప్ యాదవ్, వెల్లడించారు. మంగళవారం, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీవై పార్టీ వైపు యువత చూసేలా కృషి చేస్తానన్నారు. బడుగు బలహీన వర్గాల వారి కోసం పుట్టిన పార్టీ అని గుర్తు చేశారు. నాయకు లతో కలిసి పనిచేస్తానని ఆయన తెలియజేశారు. నాకు ఈ యొక్క పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన తెలియజేశారు.

# గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి: డిఇ శ్రీరాములు రెడ్డి





పుల్లంపేట(ప్రజా సీమ): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నూతన గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ విభాగం డీఈ శ్రీరాములు రెడ్డి అధికారులకు సూచించారు. పుల్లంపేట మండలంలో ఎంపీడీవో జయశ్రీతో సమావేశమైన ఆయన, నూతన గృహ నిర్మాణ కొరకు గతంలో సర్వే నిర్వహించిన లబ్ధిదారుల జాబితాను గ్రామ సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి వెంటనే పంపించేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అవసరమైన సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు అందుబాటులో ఉంచి, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన డీఈ, లబ్ధిదారులను ప్రోత్సహించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఫీల్డ్ విజిట్లు నిర్వహించి పురోగతి సాధించాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ స్పెషల్ అధికారులు కూడా సమన్వయంతో పనిచేసి మండలాన్ని గృహ నిర్మాణంలో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. అలాగే సిమెంట్ గోడౌన్ తనిఖీ చేసి నిల్వలో ఉన్న సిమెంట్, స్టీల్ ఎక్కువకాలం ఉంచితే పాడయ్యే ప్రమాదం ఉందని, పై అధికారుల సూచనల మేరా నిల్వ ఉన్న సిమెంటు స్టీలను త్వరగా లబ్ధిదారులకు అందజేసి గోడౌన్ ఖాళీ చేయాలని వాటిని త్వరగా లబ్ధిదారులకు కేటాయించి పంపిణీ చేయాలని గృహ నిర్మాణం వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఏఈ హరిప్రసాద్ కు ఆదేశించారు.

# శ్రీ వెంకటసాయి అన్నదాన సేవ ట్రస్ట్ దాతృత్వం

**- చైతన్య స్వచ్ఛంధ సేవా సంస్థకు వంటపాత్ర వితరణ**





మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని దేవత నగర్ నందు గల చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థను ఒకప్పుడు మదనపల్లి డ్రగ్ ఇన్స్పెక్టరుగా ఉంటూ ప్రస్తుతం అనంతపురం డ్రగ్ ఇన్స్పెక్టరుగా ఉన్న కేశవ రెడ్డి సలహా మేరకు శ్రీ వెంకట సాయి అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు ప్రెసిడెంట్ పి.సుధాకర్,అంజద్ బాషా,ఏ.వి ప్రసాద్,కిరణ్ కుమార్ మంగళవారం సందర్శించారు.వీరు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులు, ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వంటకు అవసరమయ్యే 15 కేజీల వంట పాత్రను చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణి అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం బాబుకి అందించారు.ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణి,అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం బాబు మాట్లాడుతూ డ్రగ్ ఇన్స్పెక్టర్ కేశవరెడ్డి వారి బృందం సంస్థకు చాలా సంవత్సరాలుగా తోడుగా ఉంటూ ఎన్నో సహాయ,సహకారాలు అందిస్తూ ఎంతోమందికి సంస్థ గురించి తెలియజేస్తున్నారు.ఇందులో భాగంగా శ్రీ వెంకట సాయి అన్నదాన సేవా ట్రస్టుకి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ గురించి వారి సేవల గురించి వివరించి నేడు సంస్థకు కావలసిన వంట పాత్రను బహుకరించడం చాలా సంతోషంగా ఉందని,ఇలాంటి వారి సహాయ,సహకారాలు సంస్థకు ఎల్లవేళలా ఉండాలని తెలియజేస్తూ శ్రీ వెంకట సాయి సి అన్నదాన సేవా ట్రస్ట్ ప్రెసిడెంట్ సుధాకరకి సంస్థ జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు

# ధాత్రి ఆనంద నిలయానికి ఫ్యాన్లు,మంచాలు వితరణ

**- వృద్ధుల పట్ల ఆప్యాయత చాటుకున్న కాకర్ల సురేష్**




మదనపల్లె (ప్రజా సీమ) : అనంత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కాకర్ల సురేష్ వృద్ధుల పట్ల ప్రేమను చాటుకున్నారు.మదనపల్లి పట్టణం బికేపల్లి నందు ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఆనంద నిలయానికి అనంత చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఐదు మంచాలు,ఐదు ఫ్యాన్లు వితరణ చేశారు.ఈ సందర్భంగా మంగళవారం ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి,చక్రపాణిలు మాట్లాడుతూ ధాత్రి ఫౌండేషనుకి అనంత చారిటబుల్ ట్రస్ట్ సహకారం మరువలేనిదన్నారు.ఇప్పటికే పలమార్లు ఆనంద నిలయాన్ని సందర్శించిన కాకర్ల సురేష్ మా సేవలను గుర్తించడం సంతోషదాయకమన్నారు.ఇటీవలే నీరుగట్టువారిపల్లెలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుండి 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆరుగురికి రూ.30 వేలు నగదు ప్రోత్సాహకాలు అందించారని గుర్తుచేశారు.అలసిన వృద్ధ జీవితాల ప్రేమాలయమే ఆనంద నిలయమని,దాతల సహకారంతో ఆనంద నిలయంలోని అవ్వతాతల ఆలానా,పాలనా చూస్తున్నామన్నారు.ఇప్పటి వరకు వారికి మధ్యాహ్నం,రాత్రిభోజన సదుపాయం కల్పించే వారమని,ఇక మీదట వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.కావున మరింత మంది దాతలు సహకరించి వృద్ధుల సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం దాత కాకర్ల సురేష్ ని శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# శాయ్ కు ఎంపికైన క్రీడాకారుడు దినేష్ కుమార్



రాజంపేట (ప్రజా సీమ) : రాజంపేటకు చెందిన ఎల్ఐసి ఉద్యోగి లక్ష్మీ నరసయ్య కుమారుడు చాపల దినేష్ కుమార్ ఆర్చరీ లో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్ ) కి ఎంపికయ్యాడు. దినేష్ కుమార్ కడప నగరంలోని క్రీడా పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలుమార్లు అనేక పతకాలు సాధించడంతో పాటు ఖేలో ఇండియా, ఎస్ జి ఎఫ్ నందు కూడా రాణించి పతకాలు సాధించాడు. శాయ్ కి ఎంపికైన దినేష్ కుమార్ బుధవారం హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో ముఖాముఖి కార్యక్రమానికి హాజరు కానున్నాడు. రాజంపేటకు చెందిన క్రీడాకారుడు శాయ్ కు ఎంపికవ్వడం పట్ల రాజంపేట మండలం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక



# వార్డుల పునర్విభజనపై మాజీ కౌన్సిలర్లతో వైకాపా సమావేశం

**- హాజరైన సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,అనూషా రెడ్డి**





మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలో మునిసిపల్ వార్డుల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి మునిసిపల్ అధికారులు ఇటీవల విడుదల చేసిన వార్డుల జాబితాపై అభ్యంతరాలను అధికారులకు సమర్పించేందుకు అవసరమైన సూచనలు,అభిప్రాయాలను సేకరించుటకై మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు,పార్టీ నాయకులు పాల్గొని వార్డుల పునర్వ్యవస్థీకరణలో ప్రజల అభిప్రాయాలు,భౌగోళిక పరిస్థితులు,జనాభా ఆధారిత అంశాలు సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు. ప్రజలకు అన్యాయం జరిగే విధంగా ఉన్న ప్రతిపాదనలపై అభ్యంతరాలను సమగ్రంగా సిద్ధం చేసి మునిసిపల్ అధికారులకు అందజేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా నిసార్ అహ్మమద్ మాట్లాడుతూ వార్డుల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని పేర్కొన్నారు.సమస్యాత్మక విభజిత వార్డుల ప్రతిపాదిత అభ్యంతరాలను ఆయా వార్డుల నాయకులు,మాజీ కౌన్సిలర్లు వ్యక్తిగతంగా అధికారులకు సమర్పించి మరియు పార్టీచే ఏర్పాటు చేసిన కమిటీకి సమర్పించాలని 23వ తేదీలోగా అన్ని వార్డుల అభ్యంతరాలను క్రోడీకరించి నివేదికను రూపొందించి అధికారులకు సకాలంలో అందజేయాలన్నారు.ఒకవేళఏదైనా వార్డు నుండి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే,అధికారులు రూపొందించిన నివేదికను అంగీకరించినట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు.ఈ విషయమై ఎలాంటి సందేహాలు ఉన్నా,పార్టీ నియమిత కమిటీని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలోపరిశీలకురాలు ఎన్.అనూషా రెడ్డి, మాజీ చైర్ పర్సన్ మనుజా రెడ్డి,వైస్ చైర్మన్ జింకా చలపతి,పూతలపట్టు నియోజకవర్గ వైకాపా పరిశీలకులు బాబ్ జాన్,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా,మాజీ కౌన్సిలర్లు ఫర్జానా రఫీ,ఎన్.ఇర్ఫాన్,శ్రీనివాసులు, ప్రసాద్ బాబు,పాల్ చంద్రశేఖర్,ఈశ్వర్ నాయక్,శ్రీనివాసులు,సుగుణ ఆంజనేయులు,పాకాల హరి,చరణ్, శివయ్య,రేణుక,ఎస్.వి. రమణ,బాల గంగాధర్ రెడ్డి,సుధాకర్,బిఏ ఖాజా,వినుత బాయి,శారదా రెడ్డి,నాయకులు నవాజ్,శీలం రమేశ్,నరసింహులు, నూరుల్లా,ఖిజ్రి,మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ వర్శిటీ విద్యార్థులచే పారిశ్రామిక విద్యాపర్యటన

**- బెంగళూరులోని ప్రతిష్టాత్మక సీ-డాక్ కేంద్రం సందర్శన**




కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీవ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం వారు మిట్స్ ఇండస్ట్రీ రిలేషన్స్ సెల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పారిశ్రామిక విద్యావర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బి.టెక్ మరియు ఎం.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు బెంగళూరులోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న ప్రముఖ పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) కేంద్రాన్ని సందర్శించినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు సీ-డాక్ నాలెడ్జ్ పార్క్ మరియు ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌లలో అమలవుతున్న అత్యాధునిక సాంకేతిక పరిశోధనలు,ప్రాజెక్టులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.రోహిత్ రెడ్డి,ప్రాజెక్ట్ ఇంజనీర్ మరియు అక్షయ,ప్రాజెక్ట్ అసోసియేట్ లు పాల్గొని భారతదేశపు స్వదేశీ మైక్రోప్రాసెసర్ వేగా రూపకల్పన,క్వాంటం కంప్యూటింగ్,సైబర్ సెక్యూరిటీ,ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ),మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలలో జరుగుతున్న పరిశోధనలపై అవగాహన కల్పించారు.అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ ట్రైనింగ్ స్కూల్ ద్వారా అందిస్తున్న పరిశ్రమ-ఆధారిత శిక్షణా కార్యక్రమాలు,అంతర్జాతీయ స్థాయి ప్లేస్‌మెంట్ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ పారిశ్రామిక పర్యటన ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పుస్తక జ్ఞానాన్ని పరిశ్రమలలో అమలవుతున్న ప్రాక్టికల్ సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించుకునే అవకాశం పొందడంతోపాటు,గ్లోబల్ టెక్నాలజీ ధోరణులు మరియు భవిష్యత్తులో ఉన్న ఉపాధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన పొందారని తెలిపారు.ఈ పర్యటనలో డాక్టర్ ఆర్.నిధ్యా మరియు టి.తంగరసన్ ల అధ్యాపక బృందం మరియు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపద వేళల్లో మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

**- బి.కొత్తకోటలో అవగాహన సదస్సు**

**- హాజరైన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం పర్వీన్ తాజ్**






మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని రంగసముద్రం రోడ్డు,కొండ కళ్యాణ మండపం నందు మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సీఐ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ యాప్ పైన ప్రతి మహిళా అవగాహన కలిగి తన కుటుంబ సభ్యులు మాదకద్రవ్యాల బారిన,మహిళలను వేధించే దుండగుల బారిన పడకుండా కాపాడుకోవాలని అందుకు పోలీస్ శాఖ అన్నివేళలా సిద్ధంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర తెదేపా కార్యనిర్వక కార్యదర్శి ఎస్.ఎం ఫర్వీన్ తాజ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మహిళలపైన జరుగుతున్న అత్యాచారాలు,హత్యలు దాడులు అరికట్టడానికి పెట్టిన దిశ యాప్ పూర్తిస్థాయి చట్టబద్ధత లేక సరైన సమయంలో ఎలా స్పందించాలి,ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేసిన దిశా యాప్ వల్ల గత ప్రభుత్వంలో మహిళలపైన జరిగిన అరాచకాలను అరికట్టలేక పోయిందన్నారు.పైగా మీ ఇంటి ఆడవాళ్లని,మీ ఆడపిల్లలని చూసుకోవలసింది మీరేని ప్రజలకే ఉచిత సలహాలు ఇచ్చారన్నారు.అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో హోం శాఖ మినిస్టర్ ఒక మహిళ అయి ఉండి ప్రస్తుత గవర్నమెంటు వచ్చిన తర్వాత క్రైమ్ రేట్ తగ్గిందని మరి మహిళల కోసం ఈరోజు శక్తి యాప్ తీసుకురావడం జరిగిందని,దీనివలన ఎక్కడైనా మహిళలపైన చిన్నపాటి దాడి జరుగుతుందని అనుమానం వచ్చిన వెంటనే యాప్ ఓపెన్ చేసుకొని ఒక మూడుసార్లు ఫోన్ షేక్ చేసినట్లయితే సమీపంలో ఉన్న పోలీస్ వారు వెంటనే స్పందించి అందుబాటులో వచ్చి ప్రమాదంలో ఉన్న మిమ్మల్ని కాపాడుతారని,ఈ విషయం పైన కుటుంబంలో ఉన్న పెద్దలు పిల్లలకి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు అలాంటి చెడు అలవాట్లకు పిల్లల బానిసలు కాకుండా దూరంగా ఉంచి వారి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమాదేవి,ఐసిడిఎస్ సిడిపిఓ,మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు,మండల అధ్యక్షులు నారాయణస్వామి రెడ్డి,మెడికల్ అండ్ హెల్త్ ఏఎన్ఎం రెడ్డమ్మ,వెలుగు సిబ్బంది మరియు మహిళలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ వ్యాఖ్యలపై నిరసన తెలిపిన మదనపల్లె స్వర్ణకారులు


**- విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆచారికి వినతి**



మదనపల్లె (ప్రజా సీమ) : ఏడాదిపాటు ప్రజలు బంగారు కొనవద్దని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుపై మదనపల్లెలో విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ,నవయుగ స్వర్ణకార సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కోటవీధిలో నిరసన తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాలు మూసివేసి స్వర్ణకారులు నిరసన తెలియజేయడం జరిగింది.ఇందులో భాగంగా మదనపల్లెలో స్వర్ణకారులు,విశ్వబ్రాహ్మణులు నుండి మిశ్రమ స్పందన మాత్రమే వ్యక్తమైంది.అయితే మదనపల్లెలో మాత్రం దుకాణాల మూసే విషయంలో నామమాత్రపు స్పందనే కనిపించింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారిని అన్నమయ్య జిల్లా విశ్వబ్రాహ్మణ,స్వర్ణకార సంఘాల ప్రతినిధులు కలుసుకుని నిరసన తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు.స్థానిక కోట వీధిలో స్వర్ణకారులు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ బంగారు ఏడాదిపాటు ప్రజలు ఎవరు కొనవద్దని పిలుపునివ్వడంపైన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు.కేవలం స్వర్ణకార వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద మధ్య తరగతి కుటుంబాలు ఈ పిలుపుతో ఉపాధి లేక వీధిన పడ్డ పరిస్థితులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.భారత ప్రధాని ఈ నిర్ణయంపై పునఃపరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇదే పరిస్థితి ఏడాది పాటు కొనసాగితే అనేకమంది స్వర్ణకార కుటుంబాలు ఉపాధికి దూరమై ఆర్థిక ఇబ్బందులతో అప్పుల్లో కురుకుపోయే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.కావున ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలనైనా ప్రభుత్వం చూపించి స్వర్ణకార కుటుంబాలను,స్వర్ణ వృత్తి దారులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జయ,చిన్నా, విశ్వా,యుగంధరాచారి,శంకర,రాజేష్,ఆది,చంద్ర,కలికిరి నుండి లోకేష్,నాగేశ్వర ఆచారిలు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశించినా రెవెన్యూ అధికారులు కనికరించడం లేదు


**- న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి**




మదనపల్లె (ప్రజా సీమ) : తమ తండ్రి పేర ఉన్న వ్యవసాయ పొలాన్ని ఇతరులకు కట్టబెట్టిన రెవెన్యూ అధికారులు కలెక్టర్ ఆదేశించినా కనికరించడం లేదని కలికిరికి చెందిన బాధితులు డాక్టర్ షమీ,అశ్వక్,తస్మియాలు వాపోయారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేసిఆదుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలికిరికి చెందిన వల్లీ అహ్మదుకు ముగ్గురు కుమారులు హఫిజిల్ రెహ్మాన్,కియాఫుతుల్లా,షమి కుమార్తె తస్మియా ఉన్నామన్నారు.1970లో మా తండ్రి వల్లి అహ్మద్ సర్వే నెంబర్ 1096/10లోని ఎకరం పొలాన్ని సిద్దయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడన్నారు.తాము ఉద్యోగరీత్యా బయటి ప్రాంతాల్లో ఉండడంతో మా భూమిని నిజాముద్దీన్,వెంకట్రమణారెడ్డి,రెడ్డెప్పరెడ్డి,జనార్ధన్ రెడ్డి తదితరులు కబ్జా చేసి రెవెన్యూ అధికారుల అండతా తప్పుడు పత్రాలు సృష్టించి స్వాధీనం చేసుకున్నారన్నారు.తాము కలెక్టరును సంప్రదించి మా వద్ద ఉన్న పట్టా పాసుబుక్కులు,రికార్డులు అన్నీ ఇవ్వడంతో పరిశీలించిన కలెక్టర్ సదరు భూమికి సంబందించి నివేదిక ఇవ్వాలని తహశీల్దారును అదేశించారన్నారు.ఈ మేరకు తహశీల్దారు తమను కార్యాలయానికి పిలిపించి ఏదో పొరపాటు జరిగిందని,మీ భూమి కొంత నేషనల్ హైవేకు పోగా 34 సెంట్ల స్థలం మిగిలి ఉందని చెప్పారన్నారు.అయితే మరో పక్క కబ్జా చేసిన వారితో కుమ్మక్కై తమపైకి దౌర్జన్యానికి ఉసి గొలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రమంలో మా భూమిలో ఏర్పాటు చేసుకున్న కంచెను కబ్జారాయుళ్లు ధ్వంసం చేశారని ఆరోపించారు.ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను వారు వేడుకుంటున్నారు.

# పెట్రోల్,డీజిల్ ధరల పెంపు ప్రజలపై పెనుభారం

**- కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె.బాషా ఆరోపణ**




మదనపల్లె: పెట్రోల్,డీజిల్ ధరలను పెంచడం అంటే పేద,సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారం మోపడమేనని కాంగ్రెస్ పార్టీ ఎపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.బాషా తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం లీటరుకు రూ.3కు పైగా పెంచిన కేంద్ర ప్రభుత్వం,తాజాగా మరోసారి లీటరుకు 90 పైసలు పెంచడం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇంధన ధరల పెంపు పేదలపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందని పేర్కొన్నారు.అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా ధరల పెంపు అనివార్యమని ఆయిల్ కంపెనీలు చెబుతున్నప్పటికీ,ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇందన ధరలు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డాక్టర్ ఎస్.కె. బాషా డిమాండ్ చేశారు. ప్రజ లపై ఆర్థిక భారం తగ్గించేలా ఇంధన ధరలను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.పెట్రోల్,డీజిల్ ధరలకుతోడు గ్యాస్ సిఎన్జితోపాటు నిత్యావసర ధరలు సామాన్యులపై భారం పెరుగుతుందన్నారు.దీనిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పునఃసమీక్షించి ప్రజలపై భారం తగ్గించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ఇందన వనరులపై విధిస్తున్న సెస్సు,వ్యాట్ అదనపు మొత్తాలను తగ్గించి ఉపశమనం కలిగించాలన్నారు.

# రాష్ట్ర బిజెపి అధ్యక్షునికి వినతి

## - సిద్ధవటం మండల అభివృద్ధి పనులపై - మండల బిజెపి అధ్యక్షులు సుబ్రమణ్యం



సిద్ధవటం( ప్రజా సీమ) :మంగళవారం కడప నగరంలో జరిగిన పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణ మహా అభియాన్ కి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్ మాధవ్ గారిని, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రీ నాగోతు రమేష్ నాయుడు గారిని కలవడం జరిగింది. సిద్ధవటం మండల బిజెపి అధ్యక్షులు సుబ్రమణ్యం ఈ సందర్భంగా సిద్ధవటం మండలంలోని అనేక సమస్యలను వారిరువుకి వివరించడం జరిగింది. ముఖ్యంగా సిద్ధవటం గవర్నమెంట్ హాస్పిటల్లో పోస్ట్ మార్టం గదిని ఏర్పాటు చేయవలసిందిగా మరియు బస్టాండ్ లోని బస్సు షెల్టర్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయవలసిందిగా కోరడమైనది. దీనికి స్పందించిన నాయకులు సంబంధిత ఆరోగ్య శాఖ మాత్యులు మరియు రోడ్డు భవనాల శాఖ మాత్యులు గారికి తెలియజేసి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది సుబ్రహ్మణ్యం తెలిపారు

# వలీమా వేడుకలో సందడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

## - హాజరైన రెడ్డి సాహెబ్,షేక్ అల్లాబకష్





మదనపల్లె (ప్రజా సీమ) : రాయచోటి పట్టణం,సుండుపల్లి రోడ్డులోని స్థానిక గఫూర్ ఫంక్షన్ హాల్ నందు అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అలీ సోదరుడు ఇర్షాద్ అలీ వలిమా వేడుక మంగళవారం వైభవంగా జరిగింది.ఈ వలీమా వేడుకకు మదనపల్లి సీనియర్ నాయకులు షేక్ రెడ్డి సాహెబ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అల్లాబకష్,కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా సయ్యద్ అలీ స్పందిస్తూ పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం చాలా సంతోషమని తెలియజేశారు.ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ వలీమా వేడుక ఎంతో ఘనంగా జరిగిందని,అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకేచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి అమీర్ బాషా,జిల్లా కార్యదర్శి ఖాదర్ ఖాన్,జిల్లా మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ అలీ,జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ముబారక్ ఖాన్,మదనపల్లి పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ పీర్,మదనపల్లి పట్టణ మాజీ కార్యదర్శి మహ్మద్ అలీ,పెళ్లి కొడుకు సోదరులు సాదిక్ అలీ,అమీర్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు వరం

## - కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి





రైల్వే కోడూరు మే 19( ప్రజా సీమ) ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మరియు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి రైల్వేకోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 3328గృహాలకు గాను 37.27 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ విద్యుత్ ప్లాంటేషన్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం బి కమ్మపల్లి హరిజనవాడలో మంగళవారం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన విద్యుత్ వినియోగదారులకు సంబంధించి ఏపీఎస్పీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మరియు కూడా చైర్మన్ ముక్కా రూపనంద రెడ్డి మరియు రైల్వే కోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి ఈ యొక్క పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఏ విధమైనటువంటి లాభదాయకం ఉంటుందని వివరాలను ప్రజలకు తెలియపరచడం జరిగింది. ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూలి ఈ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అనేది పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు చాలా ఉపయోగపడుతుందని సోలార్ విద్యుత్ అనేది భవిష్యత్తు తరాలకు చాలా ఉపయోగపడుతుందని ఎంతో ముందస్తు ఆలోచనతో గౌరవ భారత దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి ఆదేశాలతో మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ గార్ల ఆచరణలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ప్లాంటేషన్ జరగడం చాలా శుభసూచికంగా భావిస్తూ మన రైల్వే కోడూరు నియోజకవర్గంలో కూడా సోలార్ విద్యుత్ ప్లాంటేషన్ అనేది చాలా అవసరం అని రానున్న భవిష్యత్ తరాలకు మనం విద్యుత్ ఆదా చేసి వారికి అందజేయడం చాలా అవసరం అని తెలియజేస్తూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 3328 వేల గృహాలకు 37.27 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ ప్లాంటేషన్ అందుబాటులోకి రావడం జరిగిందని మిగతా విద్యుత్ వినియోగదారులు కూడా సబ్సిడీతో కూడిన ఈ సోలార్ ప్లాంటేషన్ ప్రక్రియను వినియోగించుకొని విద్యుత్తును ఆదా చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మోడీ వ్యాఖ్యలపై నిరసన తెలిపిన మదనపల్లె స్వర్ణకారులు

## - విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆచారికి వినతి



మదనపల్లె (ప్రజా సీమ) : ఏడాదిపాటు ప్రజలు బంగారు కొనవద్దని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుపై మదనపల్లెలో విశ్వ బ్రాహ్మణ,విశ్వకర్మ,నవయుగ స్వర్ణకార సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కోటవీధిలో నిరసన తెలిపారు.మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాలు మూసివేసి స్వర్ణకారులు నిరసన తెలియజేయడం జరిగింది.ఇందులో భాగంగా మదనపల్లెలో స్వర్ణకారులు,విశ్వబ్రాహ్మణులు నుండి మిశ్రమ స్పందన మాత్రమే వ్యక్తమైంది.అయితే మదనపల్లెలో మాత్రం దుకాణాల మూసే విషయంలో నామమాత్రపు స్పందనే కనిపించింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారిని అన్నమయ్య జిల్లా విశ్వబ్రాహ్మణ,స్వర్ణకార సంఘాల ప్రతినిధులు కలుసుకుని నిరసన తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు.స్థానిక కోట వీధిలో స్వర్ణకారులు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ బంగారు ఏడాదిపాటు ప్రజలు ఎవరు కొనవద్దని పిలుపునివ్వడంపైన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు.కేవలం స్వర్ణకార వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద మధ్య తరగతి కుటుంబాలు ఈ పిలుపుతో ఉపాధి లేక వీధిన పడ్డ పరిస్థితులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.భారత ప్రధాని ఈ నిర్ణయంపై పునఃపరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇదే పరిస్థితి ఏడాది పాటు కొనసాగితే అనేకమంది స్వర్ణకార కుటుంబాలు ఉపాధికి దూరమై ఆర్థిక ఇబ్బందులతో అప్పుల్లో కురుకుపోయే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.కావున ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలనైనా ప్రభుత్వం చూపించి స్వర్ణకార కుటుంబాలను,స్వర్ణ వృత్తి దారులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జయ,చిన్నా,విశ్వా, యుగంధరాచారి,శంకర,రాజేష్,ఆది,చంద్ర,కలికిరి నుండి లోకేష్,నాగేశ్వర ఆచారిలు పాల్గొన్నారు.

# వైసీపీలో సమర్ధవంతమైన యువనేత కిషోర్ కుమార్ రెడ్డి

## - హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనసన్మానం





మదనపల్లె (ప్రజా సీమ) : వైఎస్సార్సీపీ స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన కిషోర్ కుమార్ రెడ్డి అత్యంత సమర్థవంతమైన యువనేత అని మదనపల్లె నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం తన కార్యాలయంలో స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీగా కిషోర్ కుమార్ రెడ్డి ఎంపికైన శుభ సందర్భంలో హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని కొనియాడారు.పెద్దిరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా గుర్తింపు తెచ్చుకున్న కిషోర్ కుమార్ రెడ్డి యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి అంకితభావంతో సేవలు అందించాలని ఆకాంక్షించారు.అనంతరం కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత జగనన్న,రాజంపేట పార్లమెంట్ సభ్యులకు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి,ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మరియు హర్షవర్ధన్ రెడ్డి ఇతర పార్టీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో పి.టి.ఎం సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జయచంద్రారెడ్డి,వైసీపీ అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ కుమార్ రెడ్డి,తంబళ్లపల్లె నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు గోపిదిన్నె మల్లికార్జున రెడ్డి,బి.కొత్తకోట కృష్ణారెడ్డి,రాష్ట్ర మేదర సంఘం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తాలే సుబ్బు,వైసీపీ యువనాయకులు పూర్ణ,మహి,అశోక్ రాయల్,రాజు,దీపక్, సోము,పూర్ణ,మహి,సందీప్,శివ,హరి తదితరులు పాల్గొని కిషోర్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# పాస్టర్ అభినయ్ దర్శన్‌పై దాడి ఘటనను ఉయ్యూరు మండల పాస్టర్ ఫెలోషిప్ తీవ్ర ఖండన



ఉయ్యూరు, మే 19: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలో పాస్టర్ అభినయ్ దర్శన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ఉయ్యూరు మండల పాస్టర్ ఫెలోషిప్ తీవ్రంగా ఖండించింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసి క్రైస్తవ సమాజంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఉయ్యూరు మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు వి. జాయ్ డానియేలు అధ్యక్షతన సమావేశమైన ఫెలోషిప్ నాయకులు ఈ అమానుష ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మరియు పోలీసు శాఖను డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో క్రైస్తవులపై భౌతిక, మానసిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో క్రైస్తవ సమాజంలో భయం, ఆందోళన, గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరునికి మత స్వేచ్ఛ, భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు.

# వైకాపా ఐదేళ్ల పాలన దళితుల పాలిట అంధకారం



రాజంపేట(ప్రజా సీమ) గత వైకాపా ఐదేళ్ల అరాచక పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు మానవత్వానికే మచ్చ తెచ్చాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేది రాజకీయ పార్టీ కాదు.. అదొక 'గొడ్డలి పార్టీ', పక్కా 'దళిత ద్రోహుల పార్టీ' అని టీడీపీ ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజంపేట నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, రాజంపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జ్యోతి శివ, ఎస్టీ సెల్ రాజంపేట మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మరియు కన్వీనర్ తోకంచి రామయ్యలు సంయుక్తంగా మాట్లాడారు. "నా ఎస్సీలు, నా ఎస్టీలు" అంటూనే అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి, ఐదేళ్లపాటు దళితుల గొంతు కోశారని, వైకాపా సైకో మూకల చేతిలో రాష్ట్రంలో 200 మందికి పైగా దళితులు దారుణంగా హతమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో జరిగిన దారుణాలను నాయకులు విలేకరుల ముందుకు తెస్తూ.. కరోనా సమయంలో కనీసం మాస్కులు అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ ను నడిరోడ్డుపై బట్టలు లేకుండా నిల్చోబెట్టి, పోలీసులతో కొట్టించి, మానసిక ఆస్పత్రికి పంపించి చివరకు ప్రాణాలు బలితీసుకున్న పాపం జగన్ రెడ్డిదేనని నిప్పులు చెరిగారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా చంపి శవాన్ని ఇంటికి 'డోర్ డెలివరీ' చేసిన వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబును జగన్ రెడ్డి నేటికీ వెంటేసుకుని తిరగడం సిగ్గుచేటన్నారు. వీటికి తోడు కడపలో డాక్టర్ అచ్చెన్న హత్య, వరప్రసాద్‌కు శిరోముండనం, మరియు తాజా ఉదాహరణగా అన్నమయ్య జిల్లాలోనే వైకాపా లీగల్ సెల్ నేతలు దళిత అధికారి అయిన ఎంపీడీవో జవహార్ బాబుపై విచక్షణారహితంగా పిడిగుద్దులతో దాడి చేయడం వైకాపా అరాచకత్వానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ఆర్థికంగా కూడా జగన్ రెడ్డి దళిత, గిరిజన సమాజానికి తీవ్ర ద్రోహం చేశారని నాయకులు ఆరోపించారు. తన ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మొత్తం రూ. 33,000 కోట్లను దారి మళ్లించి, లక్షలాది మంది దళిత సోదరులు కోట్లాది రూపాయల బ్యాంకు సబ్సిడీ లోన్లు కోల్పోయేలా చేశారన్నారు. టీడీపీ హయాంతో పోల్చితే వైకాపా పాలనలో దళితులపై దాడులు ఏకంగా 10 రెట్లు పెరిగి 56,981 దాడులకు చేరాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని, దళిత మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే కేసుల్లో ఏపీ దేశంలోనే నెంబర్ 1 స్థానంలో నిలిచిందని ఎన్.సి.ఆర్.బి (చీజ=దీ) నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో దళిత మహిళ నాగమ్మపై, నెల్లూరులో అనూషపై, ధర్మవరంలో క్రీడాకారిణి స్నేహలతపై జరిగిన అత్యాచారాలు, హత్యలే దళిత మహిళలకు రక్షణ కరవైందనడానికి నిదర్శనమన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్తే రివర్స్‌లో టీడీపీ దళిత నాయకులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించిన దుర్మార్గపు చరిత్ర జగన్ రెడ్డిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఓట్ల కోసం మాత్రమే దళితులు కావాలి.. పక్కన కూర్చోబెట్టుకోవడానికి దళితులు వద్దు" అనే కపట ప్రేమను జగన్ ప్రదర్శించారని, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసి బుద్ధి చెప్పినా వైకాపా మూకల్లో మార్పు రాలేదని, రాబోయే రోజుల్లో దళిత, గిరిజన సమాజం అంతా ఏకమై ఈ గొడ్డలి పార్టీని రాజకీయంగా శాశ్వతంగా సమాధి చేయడం ఖాయమని నాయకులు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరిన అన్నమయ్య జిల్లా నాయకులు

## - సాదరంగా ఆహ్వానించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల
## - హాజరైన కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి






మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ)ఆధ్వర్యంలో మంగళ వారం విజయవాడలోని 'ఎ కన్వెన్షన్ హాల్' నందు భారీ చేరికల కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు విజయ వంతంగా జరిగింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వివిధ నియోజక వర్గాల నుంచి ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ నేతృత్వంలో తరలివచ్చిన నాయకులకు, కార్యకర్తలకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి స్వయంగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ భారీ చేరికల మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సింగం రామక్రిష్ణా రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని, అన్నమయ్య జిల్లా నుంచి తరలివచ్చిన నాయకులకు మరియు కార్యకర్తలకు మార్గదర్శకత్వం వహించారు. పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను, క్రియాశీలక పాత్రను ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు కొనియాడారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కిసాన్ కాంగ్రెస్ విభాగం మరింత కీలకంగా వ్యవహరించనుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ముఖ్య నేతల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిన ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు అగ్రనాయకులు పాల్గొన్నారు. పల్లంరాజు (సీడబ్ల్యూసి సభ్యులు), రఘువీరా రెడ్డి (సీడబ్ల్యూసి సభ్యులు), గిడుగు రుద్రరాజు (సీడబ్ల్యూసి సభ్యులు), గణేష్ యాదవ్ (ఏఐసీసీ సెక్రెటరీ), పాలక్ వర్మ (ఏఐసీసీ సెక్రెటరీ), కలిచెర్ల మస్తాన్ రెడ్డి వీరితోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్రస్థాయి నాయకులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఈ విజయవంతమైన వేడుకలో పాల్గొన్నారు. ఈ భారీ చేరికలతో అన్నమయ్య జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి సరికొత్త ఊపు వచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా సింగం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి బాటలు వేస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభ పరిణామమన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తిచేసి త్వరితగతన వినియోగం లోకి తీసుకురండి : తల్లం భరత్ కుమార్ రెడ్డి





రాజంపేట (ప్రజా సీమ) : కడప జిల్లా రాజంపేట రైల్వే స్టేషన్ కు సందర్శించిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేసిన గుంతకల్ రైల్వే టిఆర్ఎస్ కుమార్ రెడ్డి. అయన మాట్లాడుతూ గుంతకల్ డిఆర్ఎం రాజంపేట సందర్భంగా ఎల్సి గేట్ నెంబర103 గత పది సంవత్సరాలగా ప్రజలకి విద్యార్థులకి గ్రామస్తులకు ఇబ్బందులు గారికి తీసుకెళ్లడం సందర్భంగా డిఆర్ఎం గారు రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించి త్వరగా పూర్తి చేస్తామని 84, 94, 93, 97, 98, రైల్వే అండర్ బ్రిడ్జి రాకపోతే కెమెరాలు ఏర్పాటు చేయవలసిందిగా సమర్పించడం జరిగింది అనంతరం రైల్వే యొక్క ఇబ్బందులను డిఆర్ఎమ్ రైల్వే ఉన్నటువంటి రాజంపేట రైల్వే స్టేషన్ సమస్యలను డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి సమస్యలను క్షుణ్ణంగా వివరించారు. సానుకూలంగా స్పందించిన డిఆర్ఎం, త్వరలోనే ప్రణాళిక సిద్ధం చేస్తామని హామీ. కడప జిల్లా రాజంపేట రైల్వే స్టేషన్ నందు ఎల్ సి గేట్ నెంబర్ 103 వద్ద గత 10 సంవత్సరాలుగా పాదచారులు,విద్యార్థినీ ,విద్యార్థులు చాలా ఇక్కట్ల పాలవుతున్నారని, అంతేకాకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు వాడుకలోకి తీసుకురావాలని ఇలా పలు సమస్యలపై రాజంపేట రైల్వే స్టేషన్ కు తనిఖీకి వచ్చిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా కి గుంతకల్ రైల్వే డివిజన్ వినియోగదారుల సభ్యులు, వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి వినతి పత్రం ద్వారా సమస్యలని తెలియజేశారు. రాజంపేట రైల్వే స్టేషన్ కి విచ్చేసిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా కి తల్లెం భరత్ కుమార్ రెడ్డి సాదర స్వాగతం పలకడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా కి తల్లెం భరత్ కుమార్ రెడ్డి రాజంపేట రైల్వే స్టేషన్లో ఉన్నటువంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఇందులో ముఖ్యంగా ఎల్సి గేట్ నెంబర్ 84, 94 ,93, 97, 98 రైల్వే అండర్ బ్రిడ్జి రాకపోకలకు ప్రజలకు చాలా అంతరాయంగా మారడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురైన పరిస్థితి ఏర్పడిందని కావున అండర్ బ్రిడ్జి న వాడుకలోకి తీసుకురావాలని అంతే కాకుండా విద్యుత్ దీపాలు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల యొక్క భద్రతకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాటు చేయాలని తెలియజేస్తూ, రైల్వే కోడూరు రైల్వే స్టేషన్ కు సంబంధించి ముఖద్వారం వద్ద ఆర్చ్ , డిస్ ప్లే బోర్లు, ప్రయాణికులకు వీలుగా ప్లాట్ఫారం పై సౌచాలయాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం రూపంలో సమర్పించడం జరిగింది. ఇలా ప్రతి ఒక సమస్యను క్షుణ్ణంగా విన్న డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్త పెండింగ్లో ఉన్న ప్రతి పని నీ త్వరగా పూర్తిచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, సమీర్, అహ్మద్, అమీర్, రజాక్, శ్రీను మరియు రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

# వలివర్తిపాడులో జలధార' పనులు ప్రారంభం

## -బోడే చెరువు పునరుద్ధరణకు శ్రీకారం



(ప్రజా సీమ), వే 19,(వలివర్తిపాడు) :గ్రామంలోని నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లిజలధార' పథకంలి కింద మంజూరైన నిధులతో, స్థానిక లిబోడే చెరువు పునరుద్ధరణ పనులులి మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎండ తీవ్రతకు ఎండిపోయి, అట్టలు కట్టిన చెరువు గర్భాన్ని మళ్లీ జీవకళ ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు ఈ పనులను చేపట్టారు. మంగళవారం ఉదయం చెరువు ప్రాంగణంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, గునపంతో మట్టిని తవ్వి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి పనుల పరిశీలన ఈ కార్యక్రమంలో భాగంగా చెరువులో పూడికతీత పనులకు వచ్చిన ఉపాధి హామీ కూలీలతో ప్రజాప్రతినిధులు ముచ్చటించారు. చెరువు లోతును పెంచడం ద్వారా రాబోయే వర్షాకాలంలో భూగర్భ జలాలు భారీగా పెరుగుతాయని, తద్వారా చుట్టుపక్కల వ్యవసాయ బావులకు, తాగునీటి బోరుబావులకు నీటి కొరత తీరుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేకూరి జగన్మోహనరావు, రూరల్ మండల అధ్యక్షులు వాసే మురళి, యంపిడివో మండల విష్ణు ప్రసాద్, గ్రామ కార్యదర్శి ప్రసాద్ ,గ్రామ పార్టీ అధ్యక్షులు దొండపాటి మహేష్, గ్రామ నాయకులు రెమల్లి రజనీ, సమ్మెట బ్రమ్మయ , సమ్మెట రాము, ఆనంద్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది మరియు మహిళా కూలీలు పాల్గొన్నారు. చెరువు పునరుద్ధరణకు నిధులు మంజూరు కావడం పట్ల వలివర్తిపాడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

# కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి జాతీయ స్థాయిలో గుర్తింపు



(ప్రజా సీమ):మచిలీపట్నం, మే 19: దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక సర్వేలో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అత్యుత్తమ కలెక్టర్లలో ఒకరిగా ఎంపికయ్యారు. ప్రముఖ రేటింగ్ మ్యాగజైన్ ఫ్రేమ్ ఇండియా నిర్వహించిన సర్వేలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది జిల్లా కలెక్టర్లను "అత్యుత్తమ, ఉత్తమ పనితీరు కనబరిచిన పరిపాలనాధికారులు"గా ఎంపిక చేసింది. ఈ సర్వేను ఎసియా పోస్ట్ సహకారంతో నిర్వహించారు. దేశవ్యాప్తంగా సుమారు 800 జిల్లాలను పరిశీలించి, నిపుణుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి నివేదికలు, మీడియా విశ్లేషణల ఆధారంగా తుది జాబితాను రూపొందించారు. ఎంపికైన వారిలో అత్యంత ప్రతిభావంతులైన 25 మంది కలెక్టర్ల వివరాలను 2026 ప్రత్యేక ఎడిషన్‌లో ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం పట్ల జిల్లా అధికార యంత్రాంగం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ ఎం నవీన్తో పాటు పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌ను అభినందించారు.

# సినిమా న్యూస్


# కీర్తి డైట్ మ్యాజిక్..



సౌత్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ మహానటి సినిమాతో జాతీయ అవార్డు గెలుచుకుంది. అలాంటి ఈమె తన ఫిట్‌నెస్ మరియు బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్‌పై సంచలన విషయాలను పంచుకున్నారు. గత కొంతకాలంగా ఆమె బరువు తగ్గడంపై సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు, సర్జరీలంటూ ట్రోల్స్ వస్తున్న నేపథ్యంలో, వాటన్నిటికీ కీర్తి సురేష్ గట్టిగా సమాధానమిచ్చారు. తాను 9 నెలల్లో ఏకంగా 10 కేజీల బరువు ఎలా తగ్గిందో, ఆ డైట్ మ్యాజిక్ సీక్రెట్ ఏంటో ఆమె సోషల్ మీడియా పోస్ట్ లో తెలిపింది.. కీర్తి సురేష్ కెరీర్‌ను మలుపు తిప్పిన చిత్రం మహానటి. ఆ సినిమా తర్వాత దొరికిన ఒక చిన్న బ్రేక్‌లో ఆమె తన ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై గట్టిగా ఫోకస్ పెట్టాలని నిర్ణయించుకున్నారు. అప్పటివరకు వ్యాయామం అంటే పెద్దగా ఇష్టం లేని కీర్తి.. ఆ సమయంలో కఠినమైన వర్కౌట్ లు, డైట్ ప్లాన్స్‌తో సరికొత్త ప్రయోగాలు చేయడం మొదలుపెట్టారు. అలా తన ఫిట్‌నెస్ జర్నీలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. తాను బరువు తగ్గడం వెనుక ఎటువంటి సర్జరీలు లేవని, అంతా సహజంగానే జరిగిందని కీర్తి క్లారిటీ ఇచ్చారు. ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ కోసం ఆమె హై-ప్రోటీన్, లో-కార్బ్ డైట్‌ను పక్కాగా ఫాలో అయ్యారు. అంటే కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాన్ని తగ్గించి, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నారు. ఇక దీనితో పాటు హై-ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ మరియు కార్డియో వర్కౌట్ లు చేస్తూ కేవలం 9 నెలల్లోనే 10 కేజీల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచారు. కష్టపడి బరువు తగ్గితే జనాలు అభినందించాల్సింది పోయి, రకరకాల పుకార్లతో తనను చాలా బాధించారని కీర్తి ఆవేదన వ్యక్తం చేశారు. “నేను కొంచెం బొద్దుగా ఉన్నప్పుడు లావుగా ఉన్నానన్నారు.. సన్నబడిన తర్వాతేమో బలహీనంగా ఉన్నానంటూ, సర్జరీలు చేయించుకుందని ప్రచారం చేశారు. ఇక నా ముఖాన్ని, శరీరాన్ని నేను ఎప్పుడూ ఒకేలా నాచురల్ గా ఉంచుకోవడానికే ఇష్టపడతాను. జనాలు ఒకరు సన్నగా ఉంటే లావుగా అవ్వమంటారు, లావుగా ఉంటే సన్నబడమంటారు” అంటూ బాడీ షేమింగ్ చేసేవారిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఒకప్పుడు వర్కౌట్ లను అస్సలు ఇష్టపడని కీర్తి సురేష్, ఇప్పుడు వాటిని తన లైఫ్‌లో ఒక ముఖ్య భాగం చేసుకున్నారు. ప్రస్తుతం తాను స్ట్రెంత్ ట్రైనింగ్ మరియు యోగా రెండింటినీ సమానంగా బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇక మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి ఈ లైఫ్‌స్టైల్ ఎంతో హెల్ప్ అవుతుందని, ఇప్పుడు వర్కవుట్లను అస్సలు వదిలిపెట్టలేకపోతున్నానని ఆమె సంతోషంగా పంచుకున్నారు. సరికొత్త ఫిట్‌నెస్ మంత్రంతో, ఆరోగ్యకరమైన పద్ధతిలో 10 కేజీలు తగ్గి కీర్తి సురేష్ నిజమైన డైట్ మ్యాజిక్ ఏంటో చూపించారు. పుకార్లను నమ్మకుండా, పక్కా ప్లానింగ్, క్రమశిక్షణ ఉంటే ఎవరైనా అనుకున్న ఫిట్‌నెస్ గోల్స్ సాధించవచ్చని ఆమె నిరూపించారు.



# భాగ్యశ్రీకి.. తమిళంలో ఇంకోటి



అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో ‘కాంత’ అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో ‘కాంత’ అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. ‘తాయ్ కిళవి’ తరహాలోనే తన రెండో చిత్రాన్ని కూడా రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తీయబోతున్నాడు శివకుమార్. ఇలాంటి చిత్రాల్లో కథానాయికను లంగావోణీలు, చీరల్లో కొంచెం మాస్‌గా చూపిస్తుంటారు. మరి అలాంటి పాత్రలో భాగ్యశ్రీ ఎలా ఒదిగిపోతుందో చూడాలి. ‘కాంత’ సినిమా ఫ్లాప్ అయినప్పటికీ.. భాగ్యశ్రీ కెరీర్లో బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చింది. ఆమె జస్ట్ అందగత్తె కాదని, మంచి పెర్ఫామర్ అని ఈ సినిమాతో రుజువైంది.


# రామ్ చరణ్‌లో నమ్మకాన్ని నింపిన సల్మాన్-అమీర్ ఖాన్!

రామ్ చరణ్ నేడు గ్లోబల్ స్టార్. అతడిపై వందల కోట్ల వ్యాపారం జరుగుతుంది. తండ్రిని మించిన తనయుడిగా ఎదుగుతున్నాడు. కథలపరంగా చరణ్ లో ఎంతో మెచ్యూర్టీ వచ్చిందిప్పుడు. ఒకప్పుడు కమర్శియల్ కథలకే ఓటేసిన చరణ్ ఇప్పుడు వైవిధ్యమైన కాన్సెప్ట్ లు తప్ప రోటీన్ కథలకు ఒకే చెప్పడం లేదు. ప్రస్తుతం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో -పెద్ది- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. -రంగస్థలం- తర్వాత మరో మట్టి వాసన కథలో నటిస్తున్నాడని ఫస్టు లుక్ పోస్టర్ తోనే తేలిపోయింది. అటుపై ఈ కథకు క్రీడా నేపథ్యం కూడా ఉందని వెలుగులోకి వచ్చింది.

తాజాగా రిలీజ్ అయిన ట్రైలర్ తో క్రీడతో పాటు అంతకు మించి బలమైన ఎమోషన్ కూడా కథలో ఉందని.. స్టోరీలో చాలా పార్శ్వాలున్నాయని అర్దమవుతుంది. పాత్ర కోసం చరణ్ మేకోవర్ అంతకంతకు హైప్ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ మీట్ లో బాలీవుడ్ అగ్ర హీరోలైన సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్‌లు తనపై చూపిన ప్రభావం గురించి చరణ్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. -పెద్ది- సినిమా కథాంశం గ్రామీణ నేపథ్యం కలిగిన స్పోర్ట్స్ డ్రామా అని ఇలాంటి విలక్షణమైన పాత్రను అంగీకరించడానికి బాలీవుడ్ సూపర్‌స్టార్లు సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ నటించిన చిత్రాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని వెల్లడించారు.

అమీర్ ఖాన్ నటించిన -దంగల్-, సల్మాన్ ఖాన్ చిత్రం -సుల్తాన్- బాక్సాఫీస్ వద్ద సాధించిన భారీ విజయాలు, ఆ సినిమాల్లోని కంటెంట్ నటుడిగా తనలో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయని చరణ్ కొనియాడారు. -దంగల్-, -సుల్తాన్- వంటి చిత్రాలు కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా ఒక క్రీడ చుట్టూ ఉండే భావోద్వేగాలను, కష్టాలను అద్భుతంగా ఆవిష్కరించాయి. ఉత్తరాది ప్రేక్షకులు ఆ చిత్రాలను అద్భుతంగా ఆదరించడం వల్లే తాను చేస్తున్న -పెద్ది- వంటి వైవిధ్యమైన సినిమాకు పక్కా మార్గం సుగమం అయిందని చరణ్ అభిప్రాయపడ్డారు.

రూటెడ్ -ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాలకు ఇండియా అంతటా అద్భుతమైన మార్కెట్ ఉందని ఈ చిత్రాల విజయాలు నిరూపించాయని చరణ్ పేర్కొన్నారు. ఉత్తర-దక్షిణాది చిత్ర పరిశ్రమల మధ్య బంధం మరింత బలపడుతున్న తరుణంలో టాలీవుడ్ స్టార్ హీరో బాలీవుడ్ సినిమాల సక్సెస్ ఫార్ములాను - అక్కడి స్టార్ల ప్రదర్శనను ఓపెన్‌గా ప్రశంసించడం ఇండస్ట్రీలో హెల్తీ వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. మల్ల యోధులుగా సుల్తాన్ చిత్రంలో సల్మాన్ ఖాన్..దంగల్ చిత్రంలో అమీర్ ఖాన్ అసాధారణ నటన గురించి తెలిసిందే. ఆ చిత్రాల కోసం స్టార్ హీరోలిద్దరు ఎంతో శ్రమించారు. కుస్తీ పోటీ కోసం ఇద్దరు స్టార్లు ప్రత్యకంగా సన్నదమై బరిలోకి దిగారు. అందుకే పాత్రల మధ్య అంత సహజత్వం ఒట్టిపడింది. మరి -దంగల్-, -సుల్తాన్- చిత్రాలు ఇచ్చిన ఇన్స్పిరేషన్‌తో తెరకెక్కుతున్న -పెద్ది- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతోందో చూడాలి.



# మళ్లీ ఇండస్ట్రీలో కలకలం.

మూవీ ఇండ్రస్టీ లో మహిళలపై, మైనర్లపై జరిగే వేధింపుల గురించి ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద ఎప్పుడూ ఓపెన్‌గా మాట్లాడుతుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియా వేదికగా పాత తరం నటులపై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. సినిమాల పేరుతో గతంలో కొందరు సీనియర్ నటులు మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఆమె చేసిన పోస్ట్‌లు ఇప్పుడు నెట్టింట వైరల్ అయ్యింది. ఆ వివరాలు చూద్దాం. గతంలో వచ్చిన ‘దో షికారి’ అనే హిందీ చిత్రంలో 15 ఏళ్ల వయసున్న నటి రేఖతో, 32 ఏళ్ల నటుడు బిస్వజిత్ ముద్దు సీన్ చేశారంటూ ఒక నెటిజన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.ఇక ఆ సమయంలో రేఖ ఇంకా మైనర్ కావడంతో, ఈ సీన్ వెనుక ఉన్న పరిస్థితులపై నెటిజన్లు రకరకాలుగా చర్చించుకోవడం మొదలుపెట్టారు. రియాక్ట్ అయిన చిన్మయి: ఈ ట్వీట్‌పై సింగర్ చిన్మయి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాల పేరుతో, నటన పేరుతో కొందరు సీనియర్ నటులు మైనర్లపై ఇలాంటి లైంగిక వేధింపులకు పాల్పడటం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇక ఈ రకమైన ఘటనలు చూస్తుంటే చాలా బాధగా, అసహ్యంగా అనిపిస్తోందని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ వివాదంలోకి చిన్మయి బాలీవుడ్ దిగ్గజ నటులు వినోద్ ఖన్నా, ఫెరోజ్ ఖాన్‌ల పేర్లను కూడా లాగారు. గతంలో వారిద్దరి గురించి వచ్చిన కొన్ని పాత ఆర్టికల్స్, కథనాలను తాను చదివానని.. అవి చదివినప్పుడు తాను తీవ్ర ఆశ్చర్యంకు గురయ్యానని చెప్పారు. ఇక ఇండస్ట్రీలో ఇలాంటి పద్ధతులు దారుణమంటూ ఆమె మండిపడ్డారు. నెటిజన్ల కౌంటర్లు: అయితే చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. కొందరు ఆమెకు సపోర్ట్ చేస్తుండగా.. మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమెపై మండిపడుతున్నారు. ప్రస్తుతం లేని సీనియర్ నటుల గురించి, పూర్తి నిజాలు తెలియకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని, విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ఆమెకు సలహా ఇస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో అప్పట్లో ‘మీటూ’ మూమెంట్‌తో పెద్ద సంచలనం సృష్టించిన చిన్మయి.. ఇప్పుడు మళ్లీ పాత తరం నటుల విషయాలను తెరపైకి తేవడం చర్చనీయాంశమైంది. మరి ఈ సరికొత్త వివాదం ఇంకెంత దూరం వెళ్తుందో, దీనిపై పరిశ్రమకు చెందిన మిగతా వారు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



# ఆరోగ్యం

## ఎండాకాలం ఫ్రిడ్జ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పెట్టేవారికి షాకింగ్ న్యూస్ - వారికైతే మరణం గ్యారెంటీ!



ఈ రోజుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం విపరీతంగా పెరిగింది. సీసా బాటిళ్లతో కూడిన వాటర్ బాటిళ్లు మార్కెట్లో చాలా రకాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎక్కువమందీ ఇంట్లో ఫ్రిజ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లనే ఎక్కువగా వాడతారు. దీనికి కారణం, సీసా బాటిళ్లను తీసుకోవడం చాలా ఖరీదైనది. అలాగే వాటిని తీసుకున్న తరువాత కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి పగిలిపోతాయి. కానీ ప్లాస్టిక్ బాటిళ్ల ధర చౌకగా ఉంటుంది. కింద పడ్డ కూడా అంత సులభంగా పగలవు. అందుకే ఎక్కువ మంది వీటిని వినియోగించడానికి ట్రై చేస్తుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం కొన్ని ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అవి మన ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలు ప్లాస్టిక్ బాటిళ్లను ప్రస్తుత కాలంలో ఎన్నో రసాయనాలు వాడి తయారు చేస్తున్నారు. వాటి మనం ప్రతిరోజూ వాడే విధానం, వాటిలోని రసాయనాలు కరిగి మన శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అలాగే అందులోని బ్యాక్టీరియా, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కణాలు అంతా మన శరీరంలోకి చేరి.. ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే అవకాశాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లను వాడడం అనేది అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ప్లాస్టిక్ బాటిళ్లను వాడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బాటిళ్లను తరచూ మార్చడం: ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ బాటిళ్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. ఒకే బాటిల్‌ను చాలా కాలం వాడడం వల్ల, అది మురికితో నిండిపోతుంది. అలాగే అందులో బక్టీరియా పెరుగుతుంది. అలాగే, ప్లాస్టిక్ బాటిళ్లలోని రసాయనాలు నీటిలోకి లీక్ అవటం వల్ల.. అందులోని ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. ఎన్ని రోజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు మార్చాలంటే సాధారణంగా, ప్లాస్టిక్ బాటిళ్లను 6 నెలలలోపు మార్చడం మంచిది. కొన్ని అధిక నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు 12 నెలల వరకు వాడొచ్చు. అయితే, బాటిల్ పగిలిపోయినట్లయితే, దుర్వాసన వచ్చిందని గమనిస్తే వెంటనే మార్చాలి.

గ్లాస్ మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు

గ్లాస్ వాటర్ బాటిళ్లు, సాధారణంగా, 2-3 సంవత్సరాల పాటు ఉపయోగించవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు కూడా 2 సంవత్సరాల తర్వాత కచ్చితంగా మార్చాల్సిన అవసరమైతే ఉంటుంది. ఇవి స్థిరమైన పదార్థాలతో తయారు కావడంతో పాటు తొందరగా పాడవకపోవడంతో వాటిని ఎక్కువగా కాలం వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రతిరోజూ శుభ్రం చేయడం బాటిళ్లను సరైన పద్ధతిలో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. ప్రతి రోజు వాటిని వేడి నీటి మరియు సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అందులో బక్టీరియా పెరుగుదలను నివారించవచ్చు. శుభ్రతను పాటించడం వలన బాటిల్ శుభ్రంగా ఉండడంతో పాటు అందులో పొసే నీరు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయాలు: గ్లాస్ బాటిళ్లు: గ్లాస్ బాటిళ్లను ఉపయోగించడం చాలా మంచి ప్రత్యామ్నాయం. ఇవి లీకేజి సమస్య లేకుండా, ఆరోగ్యానికి ప్రమాదకరం కాని పదార్థాలను విడుదల చేయవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు: ఇవి కూడా మంచి ఆప్షన్. ఇవి దృఢంగా ఉండి, ఎక్కువ కాలం వాడటానికి సరైనవి. ఇవి పగిలిపోవడం లేదా లీక్ అవడం చాలా అరుదు. తగిన జాగ్రత్తలు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటి నిల్వ చేయడానికి, మంచి నాణ్యత కలిగిన బాటిళ్లను మాత్రమే తీసుకోవడం మంచిది. బాటిళ్లను మూసివేసి ఉంచుకోవడం వల్ల బయట జంతువులు, ధూళి, కురుపులు వాటిలో చేరకుండా ఉంటాయి. సీసా లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లలోనే నీటి నిల్వ చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

## మండే ఎండలో ఈ షర్బత్ తాగితే చిటికెలో బాడీ కూల్ అయిపోతుంది

### రంజాన్ స్పెషల్ కూడా.. ఎలా చేసుకోవాలంటే

రంజాన్ మాసం చివరి దశకు వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో ఈ రంజాన్ మాసం ముగిసిపోతుంది. మార్చి 31వ తేదీన రంజాన్ పండగ తరువాత ఈ మాసం గుడ్ బాయ్ చెప్పనుంది. అయితే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎండ వేడిమి తాళలేక రకరకాల పానీయాలు తయారు చేసుకోవడం, బయట తాగడం వంటివి చేస్తున్నారు. అయితే ఇప్పటికీ రంజాన్ పండగ కొనసాగుతున్న నేపథ్యంలో సమ్మర్? ప్రత్యేకమైన చల్లని, రిఫ్రెషింగ్ షర్బత్ తాగితే ఆ రుచి, ఆ చల్లదనం అద్భుతంగా ఉంటుంది. అలాగే సమ్మర్‌లో తాగడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అంట కూడా. ఇంట్లో ఉండే సాధారణ పదార్థాలతోనే మీ ఇంటి సభ్యులు సమ్మర్ మజా అనుభవించవచ్చు. అయితే, దీనిని తయారుచేయడానికి అవసరమైన పదార్థాలు మరియు తయారీ విధానం ఈ స్టోరీలో తెలుసుకుందాం.

షర్బత్ తయారీకి కావలసిన పదార్థాలు: పంచదార - 1 కప్పు నీళ్లు - పావు కప్పు పాలు - 4 కప్పులు కస్టర్డ్ పొడి - 1 టేబుల్ స్పూన్ పాలు (కస్టర్డ్ కోసం) - 2 టేబుల్ స్పూన్లు కుంకుమ పువ్వు - అర టీస్పూన్ యాలకుల పొడి - 1 టీస్పూన్ చియా సీడ్స్ - 1 టేబుల్ స్పూన్ బాదం, పిస్తా పలుకులు - 2 టేబుల్ స్పూన్లు.

రంజాన్ షర్బత్ తయారీ విధానం: రంజాన్ షర్బత్ తయారు చేసుకోవడానికి మొదటగా స్టవ్‌పై పాన్ పెట్టి అందులో పంచదారను వేసి, సిమ్ మంట మీద కరిగేలా బాగా కలపాలి. పంచదార కరిగి అందులో పొంగుల ద్వారా రంగు మారినప్పుడు, దానిలో పావు కప్పు నీళ్లు జోడించాలి. నీళ్లు వేసిన తర్వాత మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉంచాలి. అలానే కలుపుతూ బాగా ఉడికించుకోవాలి.

ఇప్పుడు మంటను సిమ్‌లో ఉంచి, పంచదార కరిగిపోయే వరకు..



ఒక గిన్నెలో కుంకుమ పువ్వును నానబెట్టుకోవాలి. ఆ తరువాత, పాలు కూడా ఈ మిశ్రమంలో జోడించి బాగా కలపాలి. పాలు మరియు పంచదార చక్కగా కలిసిపోయేలా 4-5 నిమిషాలు ఉడికించాలి. ఈ సమయంలో, ఒక చిన్న గిన్నెలో కస్టర్డ్ పౌడర్ తీసుకుని, 2 టేబుల్ స్పూన్ల పాలు వేసి కరిగించాలి. ఈ కస్టర్డ్ మిశ్రమాన్ని స్టవ్‌పై ఉడికే మిశ్రమంలో జోడించి, గట్టిగా కలుపుతుండాలి. ఈ మిశ్రమం తయారు చేస్తున్న సమయంలో ఎటువంటి గడ్డలు రాకుండా ఎప్పటికప్పుడు కలుపుతూ ఉండాలి. ఇప్పుడు కుంకుమ పువ్వును మరియు యాలకుల పొడిని కూడా ఈ మిశ్రమంలో జోడించి, ఇంకో 5 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తరువాత ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలో తీసుకొని, రూమ్ టెంపరేచర్‌కి రానివ్వాలి. ఆ తరువాత 2 గంటలు ఫ్రిడ్జ్‌లో వుంచాలి. ఫ్రిడ్జ్ నుండి తీసిన తర్వాత, చియా సీడ్స్ లేదా బేసిల్ సీడ్స్‌ని నీటిలో నానబెట్టుకుని, షర్బత్‌లో జోడించి బాగా కలపాలి. చివరగా, బాదం మరియు పిస్తా పలుకులతో గార్నిష్ చేసి, ఐస్ క్యూబ్స్ వేసి చల్లగా సర్వ్ చేసుకోవచ్చు. ఈ చల్లని, టేస్టీ దూద్ షర్బత్‌ను రంజాన్ పండుగ సమయంలో కానీ, సమ్మర్ లోనూ చాలా సులభంగా, తక్కువ సమయంలోనే రెడీ చేసుకొని ఆస్వాదించొచ్చు.




## మన పూర్వీకులు తిన్నది ఇదే..



మనం ఇప్పటికీ మన పూర్వీకుల ఆరోగ్యం గురించి గొప్పగా చెప్పుకుంటుంటాం. బీపీలు, షుగర్ లు వంటి ఏ రోగాలు లేకుండా హాయిగా మన పూర్వీకులు జీవించడానికి ప్రధాన కారణం వారు తీసుకున్న ఆహారం. గట్టి ఆహారం తీసుకున్నారు కాబట్టే ముసలివయస్సులో ఎంతో యాక్టివ్ గా ఉంటేవాళ్లు. మన పూర్వీకులు తిన్న ఆరోగ్యకరమైన వంటకాల్లో మెంతికూర గట్టి పప్పు ఒకటి. ఇది పోషకాల గని అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. సాధారణ పప్పు కంటే ఇది కొంచెం గట్టిగా ఉండటం వల్ల దీనికి గట్టి పప్పు అని పేరు వచ్చింది. ఇది అన్నం, చపాతీ లేదా రోటీతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది. రుచికరమైన,ఆరోగ్యకరమైన మెంతికూర పప్పు తయారుచేయడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. మెంతికూర గట్టి పప్పు తయారీకి కావలసిన పదార్థాలు -కంది పప్పు - 1 కప్పు -మెంతికూర - 1 పెద్ద కట్ట -ఉల్లిపాయ - 1 మీడియం సైజు -టమాటో - 1 మీడియం సైజు - పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ - పసుపు - 1/2 టీస్పూన్ -కారం - 1/2 టీస్పూన్ - ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -జీలకర్ర పొడి - 1/4 టీస్పూన్ -ఆవాలు - 1/2 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ - నూనె - 2 టేబుల్ స్పూన్లు -ఉప్పు - తగినంత - నిమ్మరసం - కొద్దిగా.

మెంతికూర గట్టిపప్పు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి కనీసం 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. ఇలా చేయడం వల్ల పప్పు త్వరగా ఉడుకుతుంది, రుచిగా ఉంటుంది. -తర్వాత నానబెట్టిన పప్పును కుక్కర్ లో వేసి తగినంత నీరు, కొద్దిగా పసుపు వేసి 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. పప్పు మెత్తగా ఉడకాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి కొద్దిగా నూనె వేడి చేసి తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు వేయించండి. -ఇప్పుడు తరిగిన టమాటో ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించండి. తర్వాత తరిగిన మెంతికూర వేసి అది మగ్గే వరకు ఉడికించాలి. మెంతికూర బాగా మగ్గితే దాని చేదు రుచి తగ్గుతుంది. -ఉడికించిన పప్పును పప్పు గుత్తితో మెత్తగా మాష్ చేసి..మగ్గిన మెంతికూర మిశ్రమంలో వేయండి. కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి,రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. అవసరమైతే కొద్దిగా నీరు పోసి పప్పు గట్టిదనాన్ని సర్దుబాటు చేసుకోండి. -పప్పును మూత పెట్టి 5-7 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించండి. ఇలా చేయడం వల్ల అన్ని రుచులు బాగా కలిసిపోతాయి.

## ఎగ్ బటర్ మసాలా..తిన్నారంటే మస్త్ మజా,ఎలా చేయాలంటే..



ఎగ్ బటర్ మసాలా తయారు చేయడానికి కావలసిన పదార్థాలు - గుడ్లు: 4 -కొత్తిమీర: కొద్దిగా - కసూరి మెంతి: 1 టీ స్పూన్ -కారం: 1 టీ స్పూన్ -ధనియాల పొడి: 1 టీ స్పూన్ -జీలకర్ర పొడి: 1/2 టీ స్పూన్ -గరం మసాలా: 1/2 టీ స్పూన్ -పసుపు: 1/4 టీ స్పూన్ - ఉల్లిపాయలు: 2 -టమాటాలు: 3 -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -ఫ్రెష్ క్రీమ్ (మీగడ): 2 టేబుల్ స్పూన్లు -జీడిపప్పు: 10-12 -పచ్చిమిర్చి: 2 -నూనె లేదా నెయ్యి: 2 టేబుల్ స్పూన్లు -బటర్: 2 టేబుల్ స్పూన్లు -చక్కెర: 1/2 టీ స్పూన్ -ఉప్పు: తగినంత

**ఎగ్ బటర్ మసాలా తయారీ విధానం**

-ముందుగా గుడ్లను బాగా ఉడికించి పొట్టు తీసి ఒక్కో గుడ్డును రెండు సమాన భాగాలుగా కోయాలి. మీరు కావాలంటే గుడ్డు సొనను తీసి పక్కన పెట్టుకోవచ్చు (దీనిని గ్రేవీలో వేసుకోవచ్చు). -తర్వాత వేడినీళ్లలో నానబెట్టిన జీడిపప్పును మిక్సీలో వేసి కొద్దిగా నీరు కలిపి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేడి చేసి అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత..తరిగిన టమాటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి టమాటాలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి,లేదంటే అడుగంటుతుంది. -టమాటాలు మెత్తగా ఉడికిన తర్వాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు,పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. మసాలాలు నూనెలో కాసేపు వేగితే మంచి సువాసన వస్తుంది. -ఇప్పుడు తయారు చేసుకున్న జీడిపప్పు పేస్ట్ ను అందులో వేసి బాగా కలపాలి. ఇది గ్రేవీకి మంచి చిక్కదనాన్ని ఇస్తుంది. ఒక నిమిషం పాటు ఉడికించాలి. -ఇప్పుడు అవసరమైన మేరకు నీరు పోసి, గ్రేవీని మీకు కావలసిన చిక్కదనానికి తీసుకురావాలి. తర్వాత రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. -గ్రేవీ మరిగిన తర్వాత బటర్ లేదా వెన్న, గరం మసాలా వేసి బాగా కలపాలి. వెన్న కరిగే వరకు ఉడికించాలి. -తర్వాత నలిపిన కసూరి మెంతి, కావాలనుకుంటే కొద్దిగా చక్కెర వేసి కలపాలి. చక్కెర వేయడం అనేది ఆప్షనల్.. కానీ ఇది రుచిని బ్యాలెన్స్ చేస్తుంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma